క్లుప్తంగా

ఇంటి పన్నులకు ఐదుశాతం రిబేటు

పిడుగురాళ్ల: పురపాలక సంఘ పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను ఐదు శాతం రిబేట్‌తో చెల్లించవచ్చునని కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. మార్చి 31 2023–24 సంవత్సరపు మొదటి, రెండవ ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను ఖాళీ స్థలాల పన్నులు ఏక మొత్తంగా 5 శాతం రిబేట్‌తో ఈ నెల 30లోగా చెల్లించవచ్చునని వివరించారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

షాదీఖానా శ్లాబ్ నిర్మాణం



దాచేపల్లి :స్థానిక జలగల బజారులో నిర్మిస్తున్న షాదీఖానాకు గురువారం శ్లాబ్ వేశారు. షాదీఖానా నిర్మించాలని స్థానిక ముస్లిం నేతలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కోరారు. దీంతో రూ.75 లక్షల నిధులను షాదీఖానా నిర్మాణం కోసం మంజూరు చేయించారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులను శుక్రవారం నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ ఎంపీటీసీ పూలకొట్టు జానీ, నాయకులు సయ్యద్ మౌలాలీ, మునగా కొండలు, సైదారావు పరిశీలించారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేకంగా నమాజ్ చేశారు. షాదీఖానా పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ చెప్పారు.

9న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో పాటల పోటీలు

మాచర్ల: పల్నాటి ప్రజల ఇలవేల్పు శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల పల్నాడు ఆధ్వర్యంలో ఈనెల 9న తెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు విడేల శ్రీనివాసరావు, షేక్ సికిందర్ బాషా తెలిపారు. గురువారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ పాటల పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు దాత పాశం అర్జునరావు, రెండో బహుమతి రూ.4వేలు దాత కుర్రి సాయి మార్కొండారెడ్డి, మూడో బహుమతి రూ. 3వేలు దాత కేపీ చంద్రశేఖర్‌రెడ్డి, కన్సలేషన్ బహుమతులు రూ.1000 చొప్పున షేక్ సికిందర్ బాషా, కె.అంక ప్రకాష్ అందజేస్తారని వివరించారు. పోటీలో ఎంపికైన ప్రతిఒక్కరికీ రూ.300 చొప్పున తుమ్మేపల్లి అరవింద్ అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తికల అభ్యర్థులు ఆదివారం స్థానిక మానుకొండ కల్యాణ మండపానికి ఉదయం 10 గంటలకు చేరుకోవాలని సూచించారు. ఒక సోలో, ఫాస్ట్ బీట్ పాటలు పాడాల్సి ఉంటుందని, అన్ని వయసుల వారూ అర్హులేనని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా చుండూరు వెంకటేశ్వర్లు, పర్యవేక్షణ ఓరుగంటి చెన్నకేశవరావు వ్యవహరిస్తున్నారని వివరించారు. మరిన్ని వివరాలకు 9440835472, 9849065882లను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు రాణించాలి

పిడుగురాళ్ల: విద్యార్థులు ఒత్తిడిని జయించి విజయం వైపు నడవాలని చింతలపూడి శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గంలోని అన్ని ప్రధాన సెంటర్లలో విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో చింతలపూడి చారిటబుల్ ట్రస్టు సభ్యులు నరేంద్ర, రమేష్ తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

దుర్గి: మండలంలోని ఓబులేశునిపల్లె శివారు పల్నాడు పారా బాయిల్డ్ రైస్ మిల్లు వద్ద గురువారం రాత్రి లారీ ఢీకొని ఓబులేశునిపల్లె గ్రామానికి చెందిన దేవరకొండ యలమందారెడ్డి (60) గాయపడ్డాడు. మోకాలు కింద భాగం ఛిద్రమైంది. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటున్న యలమందారెడ్డి మిర్యాలలో తిరునాళ్ళకు వెళ్ళి బైక్‌పై వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స నిమిత్తం దుర్గిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

సాగర్‌మాత చెంతకు పాదయాత్రగా భక్తులు

విజయపురిసౌత్: నలభై రోజుల పాటు మాలలు ధరించిన సాగర్‌మాత భక్తులు పాదయాత్రగా అమ్మ సన్నిధికి చేరుకుంటున్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే ప్రార్థనలను స్థానిక సాగర్ మాత ఆలయంలో విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే శిలువ మార్గంలో వేలాది మంది భక్తులు పాల్గొననున్నారు. మాలధారులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం దీక్షలు విరమించనున్నారు. ఇప్పటికే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో సాగర్‌మాత ఆలయం సందడిగా మారింది.



శుభాభినందన

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవం కోసం గురువారం చిలకలూరిపేట విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నేటి నుంచి ‘జగనన్నే మా భవిష్యత్’

- బృహత్తర కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపు



జెట్టిపాలెం సచివాలయం వద్ద జగనన్నే మా భవిష్యత్ ప్లకార్డులతో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, పార్టీ నేతలు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

మాచర్ల/రెంటచింతల: జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శుక్రవారం నుంచి జరగనుందని, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు అందరూ కలిసి సమష్టిగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డితోపాటు ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నీ ఎల్లో మీడియాతో కలిసి సంక్షేమ సర్కారుపై దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటి కుయుక్తులను తిప్పికొట్టాలని సూచించారు. పార్టీ శ్రేణులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పనితీరును, ఇప్పటివరకు ప్రతి గడపా పొందిన లబ్ధిని వివరించాలన్నారు. ఇంకా ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

రెంటచింతల: గృహ సారథులు ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు మోర్తల ఉమ చెప్పారు. గురువారం మండలంలోని మల్లవరం, జెట్టిపాలెం, తుమృకోట, పాలువాయి గేటు, మంచికల్లు, రెంటాల గ్రామాలలో గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు, గ్రామ వలంటీర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సదస్సులను నిర్వహించినట్టు వెల్లడించారు. శుక్రవారం నుంచి గృహ సారథులు జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దావులూరి ఉదయకుమారి రమేష్, గౌలమారి నాగలక్ష్మి శ్రీనివాసరెడ్డి, వడితే సోయమ్మ, పొట్లపాటి చంద్రారెడ్డి, బాలునాయక్, పార్టీ నేతలు పోట్ల ముత్తయ్య, వడితే బుద్ధసైదానాయక్, కుందురు పేర్రెడ్డి, గేటు సుబ్బారావు, మంగ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నమో.. చెన్నకేశవ



రెంటాలలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి



రెంటాలలోని దేవస్థానం వద్ద అన్నదానం చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే



మాచర్లలో ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి

వైభవంగా కల్యాణ మహోత్సవం

రెంటచింతల/మాచర్ల: మాచర్ల నియోజకవర్గం చెన్నకేశవస్వామి నామ స్మరణతో మార్మోగింది. గురువారం రాత్రి పలు చోట్ల స్వామి, దేవేరుల దివ్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రెంటచింతల మండలం రెంటాల గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నేత్రపర్వంగా జరిగిన కల్యాణోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించారు. రాత్రి 7గంటల నుంచి వేలాదిమంది భక్తులకు మహాన్నదానం చేశారు. దేవస్థానాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు. అనంతరం అన్నదానంలో పీఆర్కే స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, ఈఓ గాదె రామిరెడ్డి పాల్గొన్నారు.

- మాచర్ల పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి, దేవేరులను గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రాత్రి 10 గంటల తరువాత ఆలయ కమిటీ అధ్యక్షులు గోపవరపు నాగేశ్వరరావు, ఈఓ సాంబయ్య ఆధ్వర్యంలో స్వామి దివ్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామి దేవేరుల ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదికపైకి తీసుకొచ్చి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దంపతుల చేతులమీదుగా కల్యాణోత్సవం నిర్వహించారు.

మట్టితవ్వకాలపై విచారణ



మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

మాచవరం: చెన్నాయపాలెం గ్రామంలో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను మైనింగ్ విజిలెన్స్ అసిస్టెంట్ జియాలజిస్టు కొండారెడ్డి , దాచేపల్లి మైనింగ్ ఏడీ రామ్మోహన్‌రావు గురువారం పరిశీలించారు. విజిలెన్స్ అధికారి కొండారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేసిన భూముల్లో రెండు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మట్టి తవ్వకాలపై స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని తెలియజేసినట్లు వివరించారు. మైనింగ్ ఏడీ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యానికి సున్నపు రాయి తీసేందుకు అనుమతులు ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలకు అనుమతులు లేవని, యాజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మాతా అన్నపూర్ణేశ్వరి ఆలయ వార్షికోత్సవం

మాచర్ల: సొసైటీ కాలనీలోని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి ఆలయ వార్షికోత్సవం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పాలవాయి భాస్కర్ గురువారం చెప్పారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు హోమాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఊరేగింపు ఉంటుందన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

దాచేపల్లి : పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి ఆశోక్‌కుమార్ చేతుల మీదుగా దాచేపల్లిలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్న 760 మంది విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా అందించారు.

పవిత్ర గురువారం ప్రార్థనలు

రెంటచింతల: గుడ్‌ఫ్రైడే ముందు రోజు పవిత్ర గురువారం సందర్భంగా క్రీస్తు అంతిమ గడియలను స్మరిస్తూ కానుకమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఫిరంగిపురం మార్నింగ్‌స్టార్ కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ ఎం.బాల క్రీస్తు సందేశం ఇచ్చారు. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ వైఎల్ మర్రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమష్టి దివ్యపూజా బలి నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ సహాయ గురువులు రెవరెండ్ ఫాదర్ స్లీవారెడ్డి పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

విజయపురిసౌత్: స్థానిక చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ 7వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కుంభాభిషేకం జరిపారు. అనంతరం చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు.

పాలవాహనం అదుపుతప్పి నలుగురికి గాయాలు

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన పట్టణంలోని పాత ఖలీల్ దాబా వద్ద గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణపల్లి నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న బొలెరో పాల వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. అయితే ఈ ఘటనలో వెనుక వస్తున్న మరో ఆటో ను కూడా ఢీకొనటంతో రెండు ఆటోల్లో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రెండు 108 వాహనాల ద్వారా పిడుగురాళ్ల పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే బొలెరో పాల వాహనం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. అంతేకాకుండా ఖలీల్ దాబా సమీపంలో బైపాస్ జంక్షన్ పనులు జరుగుతున్నాయి. డబుల్ లైన్ రహదారి నుంచి సింగిల్ లైన్ రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. పట్టణ ఎస్‌ఐ పవన్‌కుమార్ ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

పథకాలు సమర్థంగా అమలు చేయాలి



సమావేశంలో వలంటీర్లతో మాట్లాడుతున్న సాంబయ్య

దాచేపల్లి : ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు చేయాలని కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య చెప్పారు. నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు వలంటీర్ల సమావేశం గురువారం నిర్వహించారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందజేసేందుకే వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని, సీఎం జగన్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా వలంటీర్లు పనిచేయాలని ఆమె చెప్పారు. ప్రతి పథకం నేరుగా లబ్ధిదారుడి ఇంటికే చేరాలని, పథకాలు పక్కదారి పడితే చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం నుంచి జరుగుతున్న మంచిని ప్రజలకు వివరించే బాధ్యత కూడా తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు, సచివాలయం కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నడికుడిలో కల్వర్టు నిర్మాణంకు పూజలు చేస్తున్న దృశ్యం

దాచేపల్లి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం తక్షణం చర్యలు తీసుకుంటున్నామని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య చెప్పారు. నగర పంచాయతీ పరిధిలోని 17వ వార్డులో సుమారుగా రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్వర్టుకు గురువారం శంకుస్థాపన చేశారు. నగర పంచాయతీ, ప్రభుత్వ నిధుల ద్వారా 17వ వార్డులో అభివృద్ధి పనులు చేస్తున్నామని, వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ తెలిపారు. అనంతరం 17వ వార్డులో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మందపాటి రమేష్ రెడ్డి, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, కో– ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, కౌన్సిలర్లు వందనపు వెంకట్రామయ్య, ఈదా వెంకటరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ నాళం శ్రీనివాసరావు, నాయకులు తండా సైదా, పల్లపు హనుమంతరావు, కొగంటి మణికంఠ, ఐనాల శ్రీరాములు, వేల్పుల కిషోర్, నడికుడి సూర్రెడ్డి, అంజి, బొల్లంపల్లి ఏసుదానం, శ్రీపతి ఏసుదాసు, వేల్పుల సైదులు, బొల్లంపల్లి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

నడికుడిలో రైళ్లను ఆపాలి

ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేత



ఏడీఆర్ఎంతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

దాచేపల్లి : నడికుడి రైల్వే జంక్షన్‌లో గతంలో ఆపిన రైళ్లను పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నడికుడి రైల్వే జంక్షన్ పరిశీలనకు వచ్చిన సేఫ్టీ అధికారులను స్థానికులు, సీపీఐ నాయకులు కలిసి గురువారం వినతిపత్రం అందించారు. కరోనాకు ముందు రాత్రి సమయంలో నారాయణాద్రి, చెన్నై, విశాఖ, డెల్టా రైళ్లు ఆగేవని, ప్రస్తుతం ఈ స్టేషన్‌లో ఆగడం లేదని వివరించారు. దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇక నుంచి రైళ్లను ఆపాలని అధికారులను స్థానికులు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం సేఫ్టీ అధికారులు స్టేషన్‌లోని వివిధ కార్యాలయాలు, రన్నింగ్ రూమ్‌లు, స్టేషన్ పరిసరాలు, రైల్వే ట్రాక్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రయాణికుల భద్రతపై ప్రధానంగా దృష్టి సారించాలని స్థానిక రైల్వే అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

లక్ష్మారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



రెంటాలలో చలివేంద్రం నిమిత్తం ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

రెంటాల(రెంటచింతల): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పేరం లక్ష్మారెడ్డి దాతృత్వాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి చెప్పారు. వేసవి దృష్ట్యా పాదచారులు, రైతుల దాహార్తిని తీర్చేందుకు పేరం లక్ష్మారెడ్డి రూ.60 వేల విలువైన మూడు ఫ్రిజ్‌లను గ్రామంలోని మూడు ప్రాంతాలలో గురువారం ఏర్పాటు చేశారు. వీటిని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. లక్ష్మారెడ్డి సేవాభావం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాలి లక్ష్మారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పేరం పెదసీతారామిరెడ్డి, ఇగుటూరి శ్రీనివాసరెడ్డి, పత్తి కోటిరెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి, పమ్మి గురవారెడ్డి, నవులూరి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పిడుగురాళ్ల: పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర) 2023–24 విద్యా సంవత్సరం 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.అమృత్ కుమార్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో మొత్తం 40 సీట్లు ఉన్నాయని, వాటిల్లో ఎస్టీకి 32, ఎస్సీకి 4, బీసీకి 2, ఓసీకి 1, ఏఈ 1 ఖాళీగా ఉన్నాయని వివరించారు. అలాగే 6,7,8,9 తరగతుల్లో ఖాళీలను బట్టి వాటిని కూడా భర్తీ చేస్తామని వెల్లడించారు. వివరాలకు 9390766950 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈనెల 30 చివరి తేదీ అని వెల్లడించారు.

కృష్ణవేణి పుష్కర్‌ఘాట్‌లో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



విజయపురిసౌత్: స్థానిక కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ వద్ద కృష్ణా జలాశయంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. విజయపురిసౌత్ ఎస్‌ఐ పి. అనిల్ కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై జపమాల, కట్ డ్రాయర్ ఉన్నాయి. నది ఒడ్డున పింక్ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్, కాఫీ కలర్ టోపి, చెప్పులు ఉన్నాయి. మృతుడు సాగర్ మాత ఆలయానికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చి స్నానం చేసేందుకు కృష్ణానదిలో దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్ళు ఉంటాయి. ఎస్‌ఐ అనిల్‌కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.